# నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, శుక్రవారం 22 మార్చి 2024 | NIZAMABAD


## మద్నూర్‌లో స్వల్ప భూకంపం!

**రిక్టర్ స్కేల్‌పై 3.6గా నమోదు**




మద్నూర్, మార్చి 21: తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో భూకంపం స్థానికులను ఒక్కసారిగా ఆందోళనకు గురిచేసింది. గురువారం తెల్లవారుజామున ఆరు గం టల ప్రాంతంలో నాందేడ్ జిల్లా హింగోలి నగరంలో భూమి కంపించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 3.6గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ వెల్లడించింది. హింగోలిలో భూమి కంపించగా.. తెలంగాణ సరిహద్దులో ఉన్న మద్నూర్ వరకు ప్రకంపనలు సంభవించగా ప్రజలు ఆందోళనకు గురయ్యారు. భూకంపం సంభవించిన సమయంలో తమ ఇంటిపైకప్పు రేకులు కదిలాయని అవల్గావ్‌కు చెందిన మొగులాజీ తెలిపాడు. తెల్లవారు నిద్రలో ఉన్న తాను ఒక్కసారిగా భూమి కంపించడంతో మేల్కొన్నట్లు మద్నూర్‌కు చెందిన సందీప్ పేర్కొన్నాడు.


## రైతులకు అండగా ఉంటాం

**దెబ్బతిన్న పంటలను పరిశీలించిన మంత్రి జూపల్లి**



భిక్కనూరు మండలం జంగంపల్లిలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి

కంఠేశ్వర్/సిరికొండ/దోమకొండ/భిక్కనూరు, మార్చి 21: వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేలు పరిహారం అందజేస్తామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని భిక్కనూరు, దోమకొండ, సిరికొండ మండలాల్లో గురువారం పర్యటించిన మంత్రి.. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశాల మేరకు పంట నష్టం జరిగిన ప్రాంతాల్లో అధికారులు గ్రామాల వారీగా నివేదిక తయారు చేస్తున్నారని తెలిపారు. నివేదిక అందగానే నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేలు అందిస్తామన్నారు. రైతుల పంటలకు ప్రమాదబీమా చేసి దానికి సంబంధించిన ప్రీమియం మొత్తం ప్రభుత్వం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఒకేసారి అమలుచేసే ఆలోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కోఆపరేటివ్ యూనియన్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.





**బీబీపాటిల్ రాకతో కాక..**

తెలుగు భాషపై ఎలాంటి అవగాహన లేని లోక్‌సభ సభ్యుడు బీబీ పాటిల్ వరుసగా రెండుసార్లు బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీగా గెలిచారు. బీఆర్ఎస్ ఊపు, కేసీఆర్ బొమ్మతో వరుస విజయాలను అందుకున్నారు. ఎంపీ పదవి పూర్తికాక ముందే బీబీ పాటిల్ తనకు రాజకీయ భవిష్యత్తును అందించిన బీఆర్ఎస్‌ను కాదని రాత్రికి రాత్రే బీజేపీకి మకాం మార్చేశాడు. ఢిల్లీలో కాషాయ కండువా కప్పుకొని వచ్చే ఎన్నికల్లో కమలం పార్టీ నుంచి పోటీకి రంగం సిద్ధం చేసుకున్నాడు. ఈ వ్యవహారంపై బీబీ పాటిల్‌పై బీఆర్ఎస్ శ్రేణులంతా తీవ్రంగా మండిపడుతుండగా బీజేపీలోనూ అదే తీరు కనిపిస్తున్నది. జహీరాబాద్ స్థానం నుంచి పోటీ చేసేందుకు బీజేపీ నుంచి చాలా మంది ఆశావహులు ముందుకు వచ్చారు. పైడి ఎల్లారెడ్డి, సోమాయప్ప, మాజీ కేంద్ర మంత్రి ఆలె నరేంద్ర తనయుడు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందిన సుభాష్ రెడ్డి, బాణాల లక్ష్మారెడ్డి తదితరులు చాలా మంది అభ్యర్థిత్వం కోసం ప్రయత్నాలు చేశారు. పార్టీని నమ్ముకొని వీరంతా చాలా కాలంగా కష్టపడి పనిచేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వచ్చిన సుభాష్‌రెడ్డి ఎంపీ సీటు తథ్యమని గతంలోనే బీజేపీ పెద్దల నుంచి మాట దక్కింది. ఇప్పుడేకంగా పక్క పార్టీ నుంచి వచ్చిన సిట్టింగ్ ఎంపీకి టికెట్ కేటాయించడంతో బీజేపీలో ఇంటిపోరు తారాస్థాయికి చేరింది. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడే గులాబీ శ్రేణులను కనీసం పట్టించుకోలేదని ఆరోపణ బీబీ పాటిల్‌పై ఉన్నది. అలాంటి వ్యక్తి బీజేపీ నేతలను ఎలా కలుపుకొని పోతాడంటూ ముఖ్యనేతలను అసంతృప్త నేతలంతా ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.

# కమలంలో కుమ్ములాటలు

**బీజేపీలో లుకలుకలు**

- అభ్యర్థుల ఖరారుతో బహిర్గతం
- సిట్టింగ్ ఎంపీలకు తప్పని పరేషాన్
- తీవ్ర నైరాశ్యంలోకి వెళ్లిన ఆశావహులు
- బీబీపాటిల్, ధర్మపురి అర్వింద్‌లకు తలపోటు
- నిజామాబాద్, జహీరాబాద్ ఎంపీ స్థానాల్లో దుస్థితి

నిజామాబాద్, మార్చి 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల ముంగిట భారతీయ జనతా పార్టీలో అంతర్గత కుమ్ములాటలు మొదలయ్యాయి. కమలం పార్టీలో మరోసారి లుకలుకలు బహిర్గతమయ్యాయి. నిజామాబాద్, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో ఇద్దరు సిట్టింగ్ ఎంపీలకు అభ్యర్థిత్వాల ఖరారు బీజేపీలో అగ్గి రాజేసింది. మొదట్నుంచి పార్టీలో ఉన్న వారికి స్థానం లేకపోవడం, సీనియర్ లీడర్ల విన్నపాలను పట్టించుకోకపోవడం వంటి కారణాలపై కుమిలిపోతున్నారు. జెండాలు మోసిన వారిని వదిలేసి అధికారం చూసి పార్టీలోకి వచ్చిన వారికి పెద్దపీట వేస్తుండడంపై మండిపడుతున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా రాజకీయ సమీకరణాలను పరిశీలించుకుంటూ తమకు పార్టీలో విలువే లేదన్నట్లుగా బాధ పడుతున్నట్లుగా తెలుస్తున్నది. ఆశావహుల విన్నపాలను పరిశీలన చేయకుండానే ఇతర పార్టీల నుంచి వచ్చిన సిట్టింగ్‌లకు గంటల వ్యవధిలోనే సీట్లు కేటాయించిన అధిష్టానం వైఖరిపై నొచ్చుకుంటున్నారు.

**అర్వింద్‌పై బీజేపీలో వ్యతిరేకత...**

నిజామాబాద్‌లోనూ సిట్టింగ్ ఎంపీగా ధర్మపురి అర్వింద్‌ను బీజేపీ నేతలే జీర్ణించుకోవడం లేదు. బాహాటంగానే సొంత పార్టీ నేతలే ఢిల్లీ, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు చేసిన ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. అర్వింద్ వద్దే వద్దంటూ ప్లకార్డుల ప్రదర్శనలు, ధర్నాలు, రాస్తారోకో ద్వారా నిరసన తెలిపారు. అర్వింద్‌కు టికెట్ ఇస్తే పని చేయబోమంటూ చాలా మంది బాహాటంగానే ప్రకటించారు. ఒక నాయకుడైతే అర్వింద్‌కు హఠావో... బీజేపీకో బచావో అంటూ ఢిల్లీలో నిరసన తెలియజేశారు. ఈ వ్యవహారం దుమారం రేపడంతో అర్వింద్ అనుచరుడిగా గుర్తింపు పొందిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి వెంటనే రంగంలోకి దిగి ఆ నేతను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఈ వ్యవహారంతో ఎంపీ అర్వింద్‌కు వ్యతిరేకంగా గళం విప్పితే సస్పెండ్ చేస్తామంటూ జిల్లా నేతలు తమ నిరంకుశత్వాన్ని బయట పెట్టుకున్నారని అంతా భావిస్తున్నారు. ఇప్పటికే అర్వింద్‌కు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే యెండల, అల్జాపూర్ శ్రీనివాస్‌లు అధిష్టానానికి ఫిర్యాదులు అందించారు. అర్వింద్ వ్యవహారశైలి నచ్చని బీజేపీ శ్రేణులు చాలా మంది ఈ ఎన్నికల్లో సహాయ నిరాకరణ చేస్తామంటున్నారు. దీంతో బీజేపీ అధిష్టానానికి కార్యకర్తల బలాన్ని తెలియజేస్తామంటూ ప్రకటిస్తున్నారు.

## ఆశీర్వదించండి.. కష్టసుఖాల్లో తోడుంటా..

**బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్**

**కోరుట్లలో పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశం**



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

కోరుట్ల, మార్చి 21: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేసి కష్టాలు కొని తెచ్చుకోవద్దని, తనను గెలిపిస్తే కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. గురువారం కోరుట్ల, మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల ఎన్నికల సన్నాహక సమావేశాలకు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ తన అమ్మమ్మ ఊరు భీమారం మండలంలోని దేశాయిపేట అని, తనకు జగిత్యాల జిల్లాతో ఆత్మీయ అనుబంధం ఉన్నదన్నారు. గ్యారెంటీల పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు రాక్షసంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో ఉన్నది ఒరిజినల్ కాంగ్రెస్ కాదని, అది టీడీపీ కాంగ్రెస్ అని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టు వెనుక సీఎం రేవంత్‌రెడ్డి, అమిత్‌షా, మోదీ హస్తం ఉందన్నారు. కాంగ్రెస్ వందరోజుల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసానిచ్చారు. ఐదేండ్లు ఎంపీగా ఉన్న ధర్మపురి అర్వింద్ ఏనాడూ ఏ ఒక్క ఊరికీ వచ్చిన పాపాన పోలేదన్నారు. పసుపు బోర్డు తీసుకువస్తానని గద్దెనెక్కిన ఆయన రైతులను మోసం చేశాడని దుయ్యబట్టారు. ప్రజల గుండెల్లో నిలిచిన కేసీఆర్ పేరును చెరిపివేయడం ఎవరితరమూ కాదన్నారు.











